



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.రాంభూపాల్, నాయకులు

చలో విజయవాడను జయప్రదం చేద్దాం

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.రాంభూపాల్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

రాష్ట్రంలో అసమానతలు లేని అభివృద్ధి కోసం సిపిఎం ఆధ్వర్యంలో ఈనెల 15న విజయవాడలో చేపట్టనున్న బహిరంగ సభను జయప్రదం చేద్దామని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.రాంభూపాల్ పిలుపునిచ్చారు. శుక్రవారం గణేనాయక్ భవన్‌లో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో 8 పుస్తకాలను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రం పునర్విభజన జరిగి పది సంవత్సరాలు పూర్తవుతున్నా ప్రాంతాల వెనుకబాటు, సామాజిక అసమానతలు కొనసాగుతున్నాయని విమర్శించారు. రాష్ట్రానికి బిజెపి ప్రభుత్వ అన్యాయం, అసమాన అభివృద్ధి–జగన్ ప్రభుత్వ విధానాలు, ధరలు ప్రజలపై భారాలు, విద్యుత్ సంస్కరణలు, పట్టణ సంస్కరణలు భారాలు, మహిళలపై హింస, ఉమ్మడి పౌరస్మృతి ఆర్‌ఎస్‌ఎస్ అజెండా, విద్యారంగ ప్రయివేటీకరణ విధానాలు అనే అంశాలపై పుస్తకాలు ముద్రించినట్లు తెలిపారు. ఈ పుస్తకాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న వినాశకర విధానాలను వివరించనున్నట్లు తెలిపారు. వెనుకబడిన రాయలసీమ, ఉత్తరాంధ్రకు ఇస్తామన్న ప్రత్యేక ప్యాకేజి, రాష్ట్రానికి హోదా కేంద్రం అమలు చేయలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వాటిని సాధించడంలో విఫలమైందన్నారు. కృష్ణాజలాల పున్ణపంపిణీ, అప్పర్‌భద్రా నిర్మాణం వల్ల రాయలసీమ నీటి జలాలకు తీవ్ర ప్రమాదం ఏర్పడుతున్న రాష్ట్ర ప్రభుత్వంలో సరైన చలనం లేదన్నారు. విభజన చట్టంలో భాగంగా రాష్ట్రంలో నిర్మించాల్సిన కేంద్ర ప్రభుత్వ సంస్థలు ఒక్కటి పూర్తి కాలేదన్నారు. వైసిపి ప్రభుత్వం నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించలేకపోయిందన్నారు. విద్యా, వైద్యరంగాలు పూర్తిగా ప్రయివేటీకరణ అవుతున్నాయని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం రూపొందించిన విద్యుత్ సంస్కరణలను వైసిపి ప్రభుత్వం బలపరచడమే కాకుండా దేశంలోనే అందరికంటే ముందుగా అమలు చేసి మోడీ ప్రసన్నం పొందడానికి ప్రయత్నిస్తోందన్నారు. పట్టణ సంస్కరణల వల్ల ఆస్థి పన్ను, చెత్తపన్ను పెరిగాయన్నారు. అసమానతలు లేని అభివృద్ధి కోసం సిపిఎం ఉద్యమిస్తోందని అందులో భాగంగా విజయవాడలో ఈనెల 15న భారీ బహింరగసభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సభకు సిపిఎం అఖిల భారత ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, పొలిట్‌బ్యూరో సభ్యులు బి.వి.రాఘవులు, రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు తదితరులు హాజరుకానున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఓ.నల్లప్ప, ఎం.బాలరంగయ్య, ఎస్. నాగేంద్రకుమార్, జిల్లా కమిటీ సభ్యులు ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి, వి.రామిరెడ్డి, ఎస్.ముష్కిన్, వై.వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌ఎఫ్‌ఐ నాయకుల ప్రచారం

రాష్ట్రంలో అసమానతలు లేని అభివృద్ధి చేయాలని సిపిఎం ఆధ్వర్యంలో ఈనెల 15న విజయవాడలో నిర్వహించనున్న భారీ బహిరంగ సభను జయప్రదం చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఓతురు పరమేష్ పిలుపునిచ్చారు శుక్రవారం ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో వివిధ కళాశాలలో తిరిగుతూ బహిరంగ సభ కరపత్రాలను విద్యార్థులకు అందజేసి బహిరంగ సభకు రావాలని ఆహ్వానించారు. రాష్ట్రంలో జరుగుతున్న అన్యాయం, వెనుకబాటు తనం, జరగాల్సిన అభివృద్ధిపై విద్యార్థులకు అవగాహన పెంపొందించుకుని పాలక ప్రభుత్వాలను నిలదీద్దామని సూచించారు. నూతన జాతీయ విద్యా విధానంతో ప్రభుత్వ విద్య నిర్వీర్యం అవుతోందన్నారు. విద్యా కాషాయీకరణ చేయడానికి మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను తిప్పి కొట్టాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ నగర అధ్యక్ష కార్యదర్శులు భీమేష్, శివ, నాయకులు సోము, రాఘవ, బలరాజు, మాదేశ్, నరసింహా, హరీష్ తదితరులు పాల్గొన్నారు.



ప్రచారం చేస్తున్న చిన్నారులు

'అనంత' బాలల ప్రచారం

కష్టం, నష్టం తెలియదు.. కల్లాకపటం తెలియని పసిపిల్లలు.. తమ భవిష్యత్తు ఎలా ఉండాలో తెలియకుండానే 'అసమానతలు లేని అభివృద్ధి చేయాలనే నినాదంతో ఇంటింటా తిరిగి చలో విజయవాడ బహిరంగ సభను జయప్రదం' చేయాలంటూ చిట్టి పొట్టి మాటలతో మాట్లాడుతూ ఆకట్టుకున్నారు. ఈనెల 15న సిపిఎం ఆధ్వర్యంలో తలపెట్టిన చలో విజయవాడ బహిరంగ సభను విజయవంతం చేయాలని శుక్రవారం నగరంలోని శ్రీశ్రీ నగర్‌లో చిన్న పిల్లలు ఇంటింటికీ తిరిగి అవ్వా.. సభకు వెళ్లాలి సిద్ధం కావాలి.. తాతా.. సభకు రావాలి.. అంటూ బుడిబుడి అడుగులు వేస్తూ ప్రచారం చేశారు. ఇందుకు ఓ వృద్ధురాలు సైతం స్పందిస్తూ బోసి నవ్వులతో 'సభకు వెళ్తా.. ఛార్జీలకు డబ్బులు ఇవ్వు పెద్దయ్యా..' అంటూ చలోక్తులు విసిరింది. ఇలా పిల్లలు కాలనీలోని ఇంటింటికి తిరిగి ప్రచారం నిర్వహించారు. సమయం దొరికితే స్నేహితులతో ఆటలు ఆడుకుందామనుకునే పిల్లలు ఇలా సమాజిక అభివృద్ధితో ముడిపడిన అంశాలపై ప్రచారం చేయడంతో కాలనీవాసులు పిల్లలను అభినందించారు. ఈ కార్యక్రమంలో చిన్నారులు రోషిని, గగన్, గురుప్రసాద్, జయకృష్ణ, హేమసాగర్, అల్లాభి తదితరులు పాల్గొన్నారు.



- ◆ కల్లూరు గ్రామంలో 57.36 ఎకరాలు అన్యాక్రాంతం
- ◆ అయినా స్వాధీనం చేసుకోని దేవాదాయ శాఖ అధికారులు

పేదలవి కూల్చి.. పెద్దలవి వదిలేసి..

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

'పేదలు.. పెత్తందారులకు మధ్య యుద్ధం జరుగుతోంది.' అంటూ ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి ఇటీవలి కాలంలో చేస్తున్న ప్రకటనలు అందరూ వినే ఉంటారు. ఆచరణలో అధికారం ఎటువైపు ఉందన్నది కల్లూరు గ్రామంలో ఇటీవల చోటు చేసకున్న ఘటనను చూస్తే అర్థమవుతుంది. అధికార యంత్రాంగం ఎవరివైపు ఉన్నారన్నదీ స్పష్టమవుతోంది. పేదలు నివాసాలను తెల్లవారుజామున మసకచీకట్లో వెళ్లి 137 ఇళ్లను నేల మట్టం చేసిన అధికారులు... పక్కనే ఉన్న పెద్దల ఇళ్లను మాత్రం ముట్టుకోలేకపోయారు. అన్యాక్రాంత మైందంటున్న దేవాదాయ శాఖ భూమిని స్వాధీనం చేసుకోలేదు. దీనిపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

57.36 ఎకరాల్లో స్వాధీనం చేసుకున్నదెంత .?

గార్లదిన్నె మండలం కల్లూరు గ్రామం పరిధిలో 57.36 ఎకరాల దేవాదాయ భూమి ఉంది. సర్వే నెంబరు 52లో 0.22 ఎకరాలు ఆంజినేయ స్వామి దేవస్థానం పరిధిలో ఉంది. సర్వే నెంబరు 99లో 0.88 ఎకరాలు అగ్రహారంలో గ్రామదేవతల ఉత్సవాల కోసం కేటాయించినది. సర్వే నెంబరు 101లో 0.78 ఎకరాలు భీరప్ప స్వామి దేవస్థానంకు సంబంధించిన భూమి ఉంది. సర్వే నంబరు 155లో 0.40 ఎకరాలు ఆంజినేయ స్వామి దేవస్థానంకు సంబంధించినది ఉంది. సర్వే నెంబరు 160లో 4.21 ఎకరాలు, సర్వే నెంబరు 172లో 7.41 ఎకరాలు, సర్వే నెంబరు 174లో 2.97 ఎకరాలు, సర్వే నెంబరు 187లో 6.07 ఎకరాలు, సర్వే నెంబరు 198లో 7.71 ఎకరాలు, సర్వే నెంబరు 215లో 3.88 ఎకరాలు, సర్వే నెంబరు 221లో 6.55 ఎకరాలు, సర్వే నెంబరు 117లో 0.98 ఎకరాలు, సర్వే నెంబరు 131లో 3.10 ఎకరాలు, సర్వే నెంబరు 259లో 7.71 ఎకరాలు, సర్వే నెంబరు 339లో 1.02 ఎకరాలుంది.

ఆ రెండు ఎకరాలపైనే

గ్రామం పరిధిలో 57.36 ఎకరాలున్నాయి. 165 సర్వే నెంబర్‌లో 3.47 ఎకరాలుంది. ఈ భూమిలోనే రెండు ఎకరాల్లో 137 మంది నిరుపేదలు గుడిసెలు వేసుకుని నాలుగేళ్లుగా జీవనం సాగిస్తూ వస్తున్నారు. ఇదిపోనూ మిగిలిన 1.47 ఎకరాలను స్థానిక అధికార పార్టీ నేతలు విక్రయించారు. ఇక్కడ మేడలు కట్టుకుని అనేక మంది నివాసముంటున్నారు. అన్యాక్రాంతమైన భూమిని స్వాధీనం చేసుకుంటున్నామంటున్న అధికారులు కేవలం ఈ రెండు ఎకరాల్లో నిరుపేదలున్న భూములనే స్వాధీనం చేసుకునే ప్రయత్నం చేశారు తప్పా, పెద్ద మేడల జోళికెళ్లలేదు. ఇదే గ్రామం పరిధిలోని తక్కిన భూముల్లోనే ఇతరులు నివాసముంటున్నారు. వాటి జోలికెళ్లకపోవడంకపై అనేక ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

పేదలపైనే ప్రతాపం

కల్లూరు గ్రామ పరిధిలోని దేవాదాయ భూమి మొత్తం అన్యాక్రాంతమైంది. ఎప్పటి నుంచో అధికారబలమున్న నేతలంతా ఆక్రమించుకుంటూ వచ్చారు. ఇంతకాలం మౌనంగా ఉంటూ వచ్చిన అధికారులు. నిరుపేదలు నిలువ నీడ లేక సెంటు జాగాలో ఇళ్లు కట్టుకుంటే మాత్రం ఆఘమేఘాలపై స్పందించి కూల్చివేయడం అన్యాయం. తక్కిన భూమి అంతా అన్యాక్రాంతమైందని చెబుతున్నా దానిపై మాత్రం స్పందించడం లేదు. పేదలకు ఇప్పటికైనా న్యాయం చేయాలని కోరుతున్నాం.

వి.రాంభూపాల్ , సిపిఎం జిల్లా కార్యదర్శి.

గూడు లేకుండా చేశారు.. న్యాయం చేయండి..!

దేవాదాయ శాఖ కార్యాలయం ఎదుట కల్లూరు బాధితులు

అనంతపురం కలెక్టరేట్ : న్యాయం చేయాలని కోరుతూ గార్లదిన్నె మండలం కల్లూరు అగ్రహారం గుడిసెలు తొలగింపు బాధితులు ఆందోళన చేపట్టారు. శుక్రవారం ఉదయం సిపిఎం ఆధ్వర్యంలో దేవాదాయ శాఖ కార్యాలయం ఎదుట వంటా వార్పుతో నిరసన తెలిపారు. పిల్లాపాపలతో రోడ్డుపై బైటాయించి అక్కడే భోజనం చేసి న్యాయం చేయాలంటూ అధికారులకు విజ్ఞప్తి చేశారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు తరిమెల నాగరాజు అధ్యక్షతన నిర్వహించిన వంటా వార్పు కార్యక్రమానికి ఏపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎం.బాలరంగయ్య మద్దతుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 165 సర్వేనెంబర్ 3.47 ఎకరాల భూమిలో పేదలు నివాసాలు ఏర్పాటు చేసుకున్నారన్నారు. 137 కుటుంబాలు నాలుగు సంవత్సరాలుగా అక్కడ నిర్మాణాలు చేసుకుని జీవనం సాగిస్తున్నారన్నారు. అధికారులు ఎలాంటి ముందస్తు నోటీసు లేకుండా వీరి నివాసాలను కూల్చివేయడం దుర్మార్గం అన్నారు. ఇంట్లో సామగ్రిని తీసుకుంటామని మహిళలు అధికారుల కాళ్లపై పడి వేడుకున్నా వారు కనికరం చూపలేదన్నారు. కల్లూరు బాధితులకు అదే స్థలంలో పట్టాలు ఇచ్చి నిర్మాణాలు చేపట్టాలన్నారు. లేని పక్షంలో దేవాదాయ శాఖ కార్యాలయం వద్దనే గుడారాలు వేయాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి చెన్నారెడ్డి, ఓబులేసు, ఎండి రాముడు, లక్ష్మీదేవి, నాగమ్మ, శంకర, శివారెడ్డి, గోపి, హోటల్ చంద్ర, నాగమణి, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.



దేవాదాయ శాఖ కార్యాలయంలో వద్ద పేదలతో కలిసి ఆందోళన నిర్వహిస్తున్న సిపిఎం నాయకులు

సంక్షేమం, అభివృద్ధిలో దేశానికే ఆదర్శం

ప్రజాశక్తి-ఉరవకొండ

సంక్షేమం, అభివృద్ధిలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం దేశానికే ఆదర్శంగా నిలిచిందని ఎంపీ తలారి రంగయ్య, మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. వజ్రకరూరు మండలం కొనకొండ్ల–3 గ్రామ సచివాలయం పరిధిలో శుక్రవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకోవడంతోపాటు ప్రభుత్వ పథకాలను వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. అనంతరం సంక్షేమ లబ్ధి వివరాలతో కూడిన బోర్డును, జగనే ఎందుకు కావాలో తెలియజెప్పే బుక్లెట్‌లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వైసిపి బిసి విభాగం జిల్లా అధ్యక్షుడు వీరన్న, మండల కన్వీనర్ సోమశేఖర్‌రెడ్డి, ఎంపిపి రమావత్‌దేవి, వైస్ ఎంపిపి సుంకమ్మ, ఎంపిడిఒ విజయలలిత, తహశీల్దార్ అనిల్‌కుమార్, మార్కెట్ కమిటీ ఛైర్‌పర్సన్ సుశీలమ్మ, నేతలు ప్రసాద్‌రెడ్డి, వెంకటరెడ్డి, సుధీర్‌రెడ్డి, ఉస్మాన్, రాకెట్ల బాబు, అమర్నాథ్, వజ్రకరూరు సర్పంచి మొనాలిసా, ఎంఎల్‌ఓ తేజేశ్వర్‌రెడ్డి, ఎస్సీ సెల్ మండల కన్వీనర్ ప్యాపిలి కృష్ణ, భీమా, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

గార్లదిన్నె : పేదల పాలిట పెన్నిధి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అని ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి తెలిపారు. శుక్రవారం కల్లూరు సచివాలయం–2లో ప్రభుత్వ విద్యా సలహాదారుతో కలిసి ఆంధ్రప్రదేశ్‌కు మళ్లీ జగనే ఎందుకు కావాలనే కార్యక్రమం నిర్వహించారు. ముందుగా సంక్షేమ పథకాల బోర్డు ఆవిష్కరణ, పార్టీ జెండా ఎగురవేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జగనన్న పాలనలో అర్హులందరికీ

'జగనే ఎందుకు కావాలి'లో నాయకులు

సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. కావున వచ్చే ఎన్నికల్లో కూడా మళ్లీ సిఎం జగన్‌నే ఆశీర్వదించాలని కోరారు. అనంతరం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ప్రభుత్వ పథకాలను వివరిస్తూ కరపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి, జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, వైసీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసయ్య, ఎంపీపీ వెంకటనారాయణ, తహశీల్దార్ ఉషారాణి, ఎంపిడిఒ విజయ్‌భాస్కర్, మాజీ ఎంపీపీ ప్రదీప్‌రెడ్డి, కన్వీనర్ నరేందర్‌రెడ్డి, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, పథకాల లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

అనంతపురం : వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను చూసి ప్రజలు మరోమారు వైసిపికి అండగా నిలవాలని మేయర్ మహమ్మద్ వసీ విజ్ఞప్తి చేశారు. శుక్రవారం నగరంలోని 1వ డివిజన్ పరిధిలో 'వై ఎపి నీడ్స్ జగన్' (జగనే మళ్ళీ ఎందుకు రావాలంటే) కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి సిఎం గజన్ అధికారంలోకి వచ్చాక చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి వివరించారు. మేనిఫెస్టోలోని 98.5 శాతం హామీలను అమలు చేశారన్నారు. గత టీడీపీ పాలనలో పాలకులు ఎన్నికల సమయంలో తప్ప మిగతా సమయాల్లో ప్రజల వద్దకు వచ్చిన పాపాన పోలేదన్నారు. అంతేగాకుండా నగరంలో ఎంపీ, ఎమ్మెల్యే, మేయర్ వర్గాలుగా విడిపోయి అభివృద్ధిని పూర్తిగా విస్మరించారన్నారు. అయితే నేడు అందుకు భిన్నంగా వైసిపి అధికారంలోకి వచ్చాక నిత్యం ప్రజల మధ్య ఉంటున్నామన్నారు. అభివృద్ధితోపాటు సంక్షేమానికి వైసిపి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. కావున సంక్షేమ పథకాలను చూసి రానున్న ఎన్నికల్లో మరోమారు వైసిపిని ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ విజయభాస్కర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



మహిళకు కరపత్రం అందజేస్తున్న మేయర్ మహమ్మద్ వసీం

కుందుర్పి : సిఎం జగన్‌తోనే అన్నివర్గాల ప్రజల అభివృద్ధి సాధ్యమని మండల కన్వీనర్ సత్యనారాయణ శాస్త్రి, ఎంపిపి కమలా నాగరాజు, జడ్పిటిసి రాధాస్వామి, సచివాలయ మండల కన్వీనర్ ఇ.రాము తెలిఆపరు. శుక్రవారం మండల కేంద్రంలోని వైఎస్ఆర్ విగ్రహం వద్ద వైసిపి జెండాను ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచి మారుతీశ్వరి రామమూర్తి, ఎంపిడిఒ లక్ష్మీనరసింహా, పంచాయతీ కార్యదర్శి మహబూబ్‌బాషా, సీసీ వెంకటస్వామి, సచివాలయ సిబ్బంది, వైసిపి నాయకులు కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న ఎంపీ తలారి రంగయ్య, ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి

బెలుగుప్ప : రాష్ట్ర అభివృద్ధి కోసం సీఎం జగన్‌ను మరోసారి గెలిపించుకుందామని ఎంపిటిసిల సంఘం జిల్లా అధ్యక్షుడు ఎంపిపి పెద్దన్న పిలుపునిచ్చారు. శుక్రవారం మండల కేంద్రంలోని 2వ సచివాలయంలో ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి అనే కర్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్ అధికారంలోకి వచ్చిన నాలుగున్నరేళ్లలో ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందాయన్నారు. ఈ పథకాలు కొనసాగాలంటే మళ్లీ జగన్‌ను గెలిపించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ రామచంద్ర, ఇఒఆర్‌డి మాధవరెడ్డి, వైసిపి నాయకులు త్రిలోక్నాథ్‌రెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షులు బి.శివలింగప్ప, సర్పంచు బాయి, వాల్మీకి సంఘం రాష్ట్ర డైరెక్టర్ రామాంజనేయులు, కన్వీనర్ మచ్చన్న, పి.శ్రీనివాసులు, జె.రామేశ్వరరెడ్డి, కరుణాకర్, గంగ్యానాయక్, తిమ్మారెడ్డి, బాబు రెడ్డి, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

శింగనమల : మండల పరిధిలోని లోలూరు పంచాయతీలో 'వై ఎపి నీడ్స్ వైఎస్ జగన్' కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిసిఎంఎస్ డైరెక్టర్ బొమ్మన శ్రీరామిరెడ్డి, రాష్ట్ర నాటక అకాడమీ ఛైర్‌పర్సన్ ప్రమీల, ఎంపిటిసి మురార్జి, వైసిపి మండల కన్వీనర్ పట్నం నగేష్, నాయకులు భాస్కర్‌రెడ్డి, చెన్నకేశవులు, సచివాలయ సిబ్బంది, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రపంచ స్థాయి పోటీ పరీక్షలకు సిద్ధం కావాలి

జిల్లా విద్యాశాఖ అధికారి వి.నాగరాజు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

విద్యార్థులు భవిష్యత్తులో ప్రపంచ స్థాయి పోటీ పరీక్షలకు సిద్ధపడాలని జిల్లా విద్యాశాఖ అధికారి వి.నాగరాజు పిలుపునిచ్చారు. జెవివి నాయకులు గాంగేనాయక్ అధ్యక్షతన శుక్రవారం జన విజ్ఞాన వేదిక నగర కమిటీ ఆధ్వర్యంలో లక్ష్మీ సినర్జి పాఠశాలలో చెకుముకి సైన్స్ సంబరాలు నిర్వహించారు. ముందుగా చెకుముకి సంబరాలు–2023 ప్రశ్నపత్రాలను డిఇఓతోపాటు జెవివి రాష్ట్ర అధ్యక్షులు మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్‌తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డిఇఓ మాట్లాడుతూ అనేక సంవత్సరాలుగా చెకుముకి సంబరాల కార్యక్రమాన్ని జెవివి చాలా విజయ వంతంగా నిర్వహిస్తోందన్నారు. ఈ సంవత్సరం ప్రశ్నపత్రాన్ని తన చేత ఆవిష్కరిస్తున్నందుకు సంతోషంగా ఉందన్నారు. ఇలాంటి పోటీ పరీక్షలు రాయడం వల్ల విద్యార్థుల్లో పోటీతత్వం, వాటి పట్ల అవగాహన పెరుగుతుందన్నారు. భాష వేరు కావచ్చు కానీ సిలబస్ అంతా ఒక్కటే కాబట్టి విద్యార్థులు ప్రపంచ స్థాయిలో పోటీ పరీక్షలకు సిద్ధం కావాలని అది హైస్కూల్ స్థాయి నుంచే మొదలవ్వాలని సూచించారు. జెవివి రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ గేయానంద్ మాట్లాడుతూ ప్రపంచ సైన్స్ దినోత్సవం రోజున ప్రపంచ వ్యాప్తంగా సైన్స్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఒకప్పటి ప్రాచీన మానవుడు ప్రకృతిని చూసి బయపడే వాడని ప్రస్తుతం సైన్స్ అభివృద్ధి చెందిన తర్వాత అందులోని రహస్యాలను చేదించాడానికి సైన్స్ ప్రాధాన్యత పెరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో జెవివి గౌరవాధ్యక్షురాలు డాక్టర్ పి.ప్రసూన, సీనియర్ నాయకులు డాక్టర్ వీరభద్రయ్య, స్కూల్ కరస్పాండెంట్ మధు, జెవివి నాయకులు రామిరెడ్డి, వీరరాజు, లక్ష్మీనారాయణ, రామకృష్ణ, నూర్, ప్రసాద్, ప్రసాద్‌రెడ్డి, నవీన్, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా విద్యా శాఖ అధికారి వి.నాగరాజు

అడిగిన వారందరికీ ఇసుక అందించాలి : సిపిఎం

ప్రజాశక్తి-గుంతకల్లు

ఇళ్ల నిర్మాణాలు చేసుకుంటున్న పేద, మధ్య తరగతి ప్రజలందరికీ ఇసుకను అందించాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని మార్కెట్ యార్డులో ఉన్న ఇసుక రీచ్‌ను సిపిఎం నాయకులు పరిశీలించారు. అనంతరం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ పట్టణంలో జగనన్న ఇల్లు కట్టుకునే వారికి కూపన్ ద్వారా ఇసుక పంపిణీ చేయడం లేదన్నారు. హౌసింగ్ అధికారులు ఇచ్చిన కూపన్లు చూపించినప్పటికీ ఇసుక పంపిణీ చేయడం లేదన్నారు. అధికారులు వెంటనే స్పందించి ప్రజలకు ఇసుకను అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు డి.శ్రీనివాసులు, బి.శ్రీనివాసులు, పట్టణ కార్యదర్శివర్గ సభ్యులు దాసరి శ్రీనివాసులు, కసాపురం రమేష్, పట్టణ కమిటీ సభ్యులు తిమ్మప్ప, రామునాయక్, చరణ్, వెంకీ, అబ్దుల్లా, తదితరులు పాల్గొన్నారు.



ఇసుక డంప్‌ను పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు

వేతనాలు చెల్లించండి..మహాప్రభో..

పంచాయతీ కార్మికుల వినూత్న నిరసన

ప్రజాశక్తి-తాడిపత్రి రూరల్

మూడు నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలను తక్షణమే చెల్లించాలని గన్నేవారిపల్లి పంచాయతీ కార్మికులు డిమాండ్ చేశారు. ఈమేరకు శుక్రవారం కడప రోడ్డులోని రామాలయం వద్ద రూరల్ పరిధిలోని గన్నేవారిపల్లి పంచాయతీ కార్మికుకులు మోకాళ్లపై కూర్చుని వినూత్నంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మూడు నెలలుగా జీతాలు చెల్లించకపోవడంతో కుటుంబ పోషణ భారంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. వేతనాలు చెల్లించకపోవడంతో పండగపూట కూడా పస్తులు ఉండాల్సిన పరిస్థితులు నెలకొన్నాయన్నారు. ఇప్పటికే అప్పులు తెచ్చి కుటుంబాలు పోషించుకుంటున్నామని, ఇక అప్పులు కూడా పుట్టని పరిస్థితులు నెలకొన్నాయన్నారు. జీతాలు ఇవ్వాలని అధికారులు, పాలకులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా ఏమాత్రం స్పందించడం లేదని వాపోయారు. ఇప్పటికైనా తమపై దయ ఉంచి పెండింగ్‌లో ఉన్న వేతనాలను చెల్లించడంతోపాటు నెలనెలా సకాలంలో జీతాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్మికులు రాజు, సంధ్యాభాయి, రామకృష్ణ, అచ్చమ్మబాయి, కుళ్లాయప్ప, ఓబయ్య, భాస్కర, జిజె.బాయి, కుళ్లాయమ్మ, రాణి, తదితరులు పాల్గొన్నారు.



మోకాళ్లపై నిరసన వ్యక్తం చేస్తున్న పంచాయతీ కార్మికులు

కరువు సహాయక చర్యలు చేపట్టాలి

కలెక్టర్‌కు విన్నవించిన ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి


కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి

ప్రజాశక్తి-ఉరవకొండ

జిల్లాలో నెలకొన్న తీవ్ర వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో కరువు సహాయక చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే వై.శివరామిరెడ్డి కోరారు. ఈమేరకు శుక్రవారం జిల్లాకేంద్రంలోని కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ గౌతమిని కలిసి పలు సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రం సమర్పించారు. ముఖ్యంగా జిల్లాలోని బెళుగుప్ప, బొమ్మనహాల్, యల్లనూరు మండలాలను కరువు మండలాలుగా ప్రకటించడంతోపాటు వలసల నివారణకు చర్యలు చేపట్టాలన్నారు. జాతీయ ఉపాధి హామీ పథకం కింద 150 దినాలు పని కల్పించడంతోపాటు 18ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ జాబ్‌కార్డు మంజూరు చేసి పని కల్పించాలన్నారు. అలాగే తాగునీటి సమస్య తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఉరవకొండ, వజ్రకరూరు మండలాల్లో నివసిస్తూ అటవీ భూములు సాగుహక్కు కలిగిన గిరిజనులు, తండావాసులకు బ్యాంకుల్లో క్రాప్‌లోన్ ఇవ్వాలని కోరారు. స్వచ్ఛభారత్ మిషన్ పథకం కింద జిల్లావ్యాప్తంగా పని చేస్తున్న హరిత సభ్యులు, పారిశుధ్య కార్మికులకు నెలనెలా వేతనాలు అందించాలని వినతిపత్రం సమర్పించారు.

జెవివి 'చెకుముకి' పరీక్షలు

రాయదుర్గం : డి.హీరేహాల్ మండలంలోని నాలుగు కేంద్రాల్లో శుక్రవారం చెకుముకి సైన్స్-2023 పరీక్షలు నిర్వహించినట్లు యుటిఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు తెలిపారు. పాఠశాల స్థాయిలో హెచ్.సిద్దాపురం, డి హిరేహాల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, కస్తూరిబా బాలిక విద్యాలయం, మహాత్మ జ్యోతిబా పూలే విద్యాలయాల్లో నిర్వహించిన పోటీల్లో 134 మంది విద్యార్థులు పరీక్షలు రాసినట్టు తెలిపారు. ఆయా పరీక్షలను పాఠశాలల ప్రధానోపాధ్యాయులు గౌరీశంకర్, రామాంజనమ్మ, ప్రత్యేక అధికారిణి శిల్పా, ప్రిన్సిపాల్ నారాయణస్వామి పర్యవేక్షించినట్లు తెలిపారు. ఈ పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన ముగ్గురు విద్యార్థులను 30న జరగనున్న మండల స్థాయి చెకుముకి సైన్స్ పరీక్షలకు పంపనున్నట్లు తెలిపారు.

బుక్కరాయసముద్రం : మండలంలోని జెడ్పీ పాఠశాలలో విద్యార్థులకు శుక్రవారం చెకుముకి టెస్టు నిర్వహించారు. ఈ సందర్భంగా దాదాపు 90 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు రమణయ్య, మహమ్మద్‌గౌస్, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గుత్తి : పట్టణంలోని పద్మవాణి ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాల, మాసినేని ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాలల్లో శుక్రవారం జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో పాఠశాల స్థాయి చెకుముకి శాస్త్రీయ ప్రతిభ పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జెవివి రాష్ట్ర నాయకులు డాక్టర్ ఎం.రంగన్న, జిల్లా అధ్యక్షులు పి.వెంకటరామిరెడ్డి, మండల అధ్యక్షులు ఎ.రామాంజనేయులు, పద్మవాణి హైస్కూల్ కరస్పాండెంట్ బాబు, మాసినేని పాఠశాల ప్రిన్సిపాల్ శ్యాముల్, జెవివి నాయకులు వేణు, రాజు, గుత్తి కోట సంరక్షణ సమితి అధ్యక్షుడు సి.విజయభాస్కర్, ఉపాధ్యాయులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఉరవకొండ : మండల పరిధిలోని అన్ని పాఠశాలల్లో 8,9,10వ తరగతి విద్యార్థులకు జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో చెకుముకి సంబరాలు-2023లో భాగంగా "చెకుముకి టాలెంట్ టెస్ట్' నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

సబ్సిడీ స్ప్రేయర్లను సద్వినియోగం చేసుకోవాలి

ఎంపిపి దాసరి సునీత


స్ప్రేయర్‌ను చూపుతున్న ఎంపిపి దాసరి సునీత

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

సబ్సిడీపై పంపిణీ చేసే స్ప్రేయర్లను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపిపి దాసరి సునీత సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని వ్యవసాయ కార్యాలయంలో మండల వ్యవసాయ సలహా మండలి అధ్యక్షులు పెద్ద కొండయ్య అధ్యక్షతన వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉద్యానశాఖలో రైతులకు 50 శాతం సబ్సిడీతో తైవాన్ స్ప్రేయర్లను సప్లయ్ చేస్తున్నట్లు తెలిపారు. వీటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వ్యవసాయ సలహా మండలి అధ్యక్షులు పెద్ద కొండయ్య మాట్లాడుతూ తీవ్ర వర్షభావ పరిస్థితులు ఉన్నందుల వల్ల రైతులు ఆరుతడి పంటలను సాగు చేసుకోవాలని సూచించారు. ముఖ్యంగా తక్కువ వ్యవధిలో చేతికి వచ్చే చిరుధాన్యాలను సాగు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పసుసంవర్ధక శాఖ ఎడిఎ రత్నకుమార్, మండల వ్యవసాయధికారి శ్యాంసుందర్‌రెడ్డి, సభ్యులు బోయకొట్టాల నాగరాజ, దాసరి నారాయణస్వామి, తహశీల్దార్ కార్యాలయ ప్రతినిధి మస్తాన్, ఆదర్శ రైతులు, ఎఇఒ జ్ఞానజ్యోతి, రైతుభరోసా కేంద్ర ఇన్‌ఛార్జిలు పాల్గొన్నారు.

'ఉపాధి హామీ' సామాజిక తనిఖీ


సమావేశంలో మాట్లాడుతున్న ఎడిఎ రవి

ప్రజాశక్తి-నార్పల

మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో ఉపాధి హామీ పథకంపై శుక్రవారం సామాజిక తనిఖీ నిర్వహించారు. పది రోజుల నుంచి నిర్వహించిన ఉపాధి పనుల తనిఖీపై జిల్లా, మండల అధికారులు, ప్రజాప్రతినిధుల సమక్షంలో ఓపెన్ ఫోరం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని 17 పంచాయతీల్లో 2022 ఏప్రిల్ నుంచి 2023 మార్చి 31 వరకు సుమారు రూ.16 కోట్ల హామీ పనులు జరిగినట్లు ప్రిసైడింగ్ ఆఫీసర్ సుధాకర్‌రెడ్డి, తెలిపారు. ఇందులో ఉపాధి సిబ్బంది రూ.45,949 రికవరీ చేయడంతోపాటు ఉద్యానవన రైతుల నుంచి రూ.3,218ను రికవరీకి ఆదేశించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా నీటి యాజమాన్య సంస్థ విజిలెన్స్ ఆఫీసర్ రమణారెడ్డి, ఏపీడీ అనంతపురం అనురాధ, అంబుడ్స్‌మెన్ మధు, మండల అధ్యక్షులు నాగేశ్వరరావు, ఎంపిటిసి శంకర్‌యాదవ్, రాజారెడ్డి, కటమయ్య, సావిత్రమ్మ, సర్పంచులు రామాంజనమ్మ, వెంకటనారాయణమ్మ, కుల్లాయిరెడ్డి, రాంభూపాల్‌రెడ్డి, కుళ్లాయప్ప, ఎంపిడిఒ దివాకర్, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

విరాళాల సేకరణలో 'అనంత' ప్రథమ స్థానం

అనంతపురం : భారత రక్షణ మంత్రిత్వ శాఖకు విరాళాల సేకరణలో అనంత వైద్య కళాశాల దేశంలోనే ప్రథమ స్థానం సాధించినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.మాణిక్యరావు తెలిపారు. ఈమేరకు ఢిల్లీ నుంచి వచ్చిన ఎన్‌సిసిహెచ్ మ్యాగజైన్‌ను ప్రిన్సిపాల్ కళాశాల అడ్మినిస్ట్రేటివ్ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ మేడా ఆత్మారామ్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ అదిరెడ్డి పరదేశీనాయుడు శుక్రవారం చూపించారు. ఈ ఘనతకు ముఖ్య కారణం తమ పూర్వ ప్రిన్సిపాల్ డాక్టర్ నీరజ, విరాళాలు అందించిన దాతలు, కృషి చేసిన ఎన్ఎస్ఎస్ వైద్య విద్యార్థులు, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ అదిరెడ్డి పరదేశీనాయుడును ప్రిన్సిపాల్ అభినందించారు.

అంతర్జాతీయ గణకుల దినోత్సవం

రాయదుర్గం రూరల్ : స్థానిక కెబిఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వాణిజ్య శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం అంతర్జాతీయ గణకుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ రఘురామమూర్తి మాట్లాడుతూ అకౌంటెన్సీ కష్టమైన సబ్జెక్టు అయినప్పటికీ అవగాహన పెంచుకుని జ్ఞానం సంపాదిస్తే మంచి అవకాశాలు ఉంటాయన్నారు. చార్టెడ్ అకౌంటెంట్ రవి మాట్లాడుతూ కృషి, పట్టుదల ఉంటే ఎంతటి ఉన్నత లక్ష్యమైనా సాధించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ శ్రీనివాసులు, అధ్యాపకులు రవికుమార్, రాధాకృష్ణ, కోదండరాములు, దేవదాస్, విజయ్‌కుమార్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ నారాయణ, వినోద్‌కుమార్, పాండురంగ, తదితరులు పాల్గొన్నారు.

సామాన్యుడి ఆయుధం సమాచార హక్కు చట్టం

మున్సిపల్ రీజనల్ డైరెక్టర్ మూర్తి


స.హ.చట్టం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మున్సిపల్ ఆర్‌డి మూర్తి, తదితరులు

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

సామాన్యుడికి సమాచార హక్కు చట్టం ఒక వజ్రాయుధం లాంటిదని మున్సిపల్ రీజనల్ డైరెక్టర్ మూర్తి తెలిపారు. శుక్రవారం నగరంలోని మున్సిపల్ ఆర్‌డి కార్యాలయంలో 'సమాచార హక్కు చట్టం' పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సమాచార హక్కు చట్టంపై అవగాహన చేసుకుంటే అటు ప్రభుత్వానికి, ఇటు ప్రజలకు జవాబుదారీగా పారదర్శకంగా ఉండే అవకాశం ఉంటుందన్నారు. కమిషనర్ భార్గవ్ మాట్లాడుతూ నగరంలోని సచివాలయాల సిబ్బందికి శిక్షణ తరగతులు నిర్వహించాలని, సమాచార హక్కు పరిరక్షణ సమితి అధ్యక్షులు హోన్నూరప్ప, కంబదూరు షేక్ నబీరసూల్‌కు సూచించారు. ఈ కార్యక్రమంలో సాంస్కృతిక కార్యదర్శి షేక్ రషీద్‌బాషా, హాజీ, బషీర్ అహ్మద్, మురళీధర్, బాషా, తదితరులు పాల్గొన్నారు.

చలో విజయవాడను జయప్రదం చేయండి : సిపిఎం


గుత్తిలో పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-గుత్తి

అసమానతలు లేని అభివృద్ధి కోసం సిపిఎం ఆధ్వర్యంలో చేపట్టిన బస్సుజాతాలు ముగింపు సందర్భంగా ఈనెల 15న విజయవాడలో చేపట్టిన బహిరంగ సభను జయప్రదం చేయాలని సిపిఎం నాయకులు ఎస్.రేణుక, ఎం.మల్లేష్ పిలుపునిచ్చారు. ఈమేరకు శుక్రవారం పట్టణంలోని దాసరి కాలనీలో బహిరంగ సభకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బహిరంగ సభకు సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ సీతారాం ఏచూరి, పోలిట్‌బ్యూరో సభ్యులు బివి. రాఘవులు, రాష్ట్ర కార్యదర్శి బి.శ్రీనివాసరావు హాజరుకానున్నట్లు తెలిపారు. కావున ఈ సభకు ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు యు.మల్లికార్జున, మహేష్, శీనా, నరసింహ, సూర్యుడు తదితరులు పాల్గొన్నారు.

పుట్లూరు : ఈనెల 15న విజయవాడలో నిర్వహించనున్న ప్రజారక్షణ భేరి బహిరంగ సభను విజయవంతం చేయాలని సిపిఎం నాయకులు సూరి, వెంకటచౌదరి పిలుపునిచ్చారు. ఈమేరకు శుక్రవారం మండల కేంద్రంలో ఇందుకు సంబంధించిన వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అసమానతలు లేని అభివృద్ధి కోసం రాష్ట్రవ్యాప్తంగా సిపిఎం ఆధ్వర్యంలో బస్సుజాతాలు నిర్వహించి ఈనెల 15వ తేదీ ముగింపు సందర్భంగా భారీ బహిరంగ సభ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సభకు సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ సీతారాం ఏచూరి, పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు, రాష్ట్ర కార్యదర్శి బి.శ్రీనివాసులు హాజరుకానున్నట్లు తెలిపారు. కావున మండలంలోని రైతులు, వ్యవసాయ కార్మికులు, ఉపాధి హామీ కూలీలు, చేతివృత్తిదారులు, చిన్న, సన్నకారు రైతులు, మహిళలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు భాస్కర్‌రెడ్డి, పెద్దయ్య, నాగభూషణం, రైతులు కుళ్లాయప్ప, పుల్లారెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, వెంకటనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

రేషన్ డీలర్‌పై చర్యలకు వినతి

ఉరవకొండ : రేషన్ బియ్యం సక్రమంగా సరఫరా చేయని డీలర్‌పై చర్యలు తీసుకోవాలని పలువురు మహిళలు ఉరవకొండ తహశీల్దార్ శ్రీధర్‌మూర్తికి శుక్రవారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ ఉరవకొండ పట్టణంలోని 6వ వార్డు పోస్ట్ ఆఫీస్ ప్రధాన కార్యాలయం సమీపంలో నెంబర్.20షాపునకు చెందిన డీలర్ నెలనెలా సక్రమంగా బియ్యం పంపిణీ చేయడం లేదన్నారు. వెంటనే చర్యలు తీసుకుని లబ్ధిదారులకు నెలనెలా రేషన్ పంపిణీ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

రాయదుర్గం రైల్వేస్టేషన్ అభివృద్ధికి చర్యలు : విప్ కాపు

రాయదుర్గం : రాయదుర్గంలోని రైల్వేస్టేషన్ అభివృద్ధికి నైరుతి రైల్వే శాఖ చర్యలు తీసుకుంటోందని విప్ కాపు రామచంద్రారెడ్డి తెలిపారు. ఈమేరకు నైరుతి రైల్వే జనరల్ మేనేజర్ సంజీవ్ కిషోర్‌కు రాసిన లేఖకు జనరల్ మేనేజర్ కార్యాలయం నుంచి సమాచారం వచ్చినట్లు ఎమ్మెల్యే తెలిపారు. రాయదుర్గం రైల్వేస్టేషన్‌ను అభివృద్ధి చేసి మౌలిక సౌకర్యాలు కల్పించనున్నట్లు తెలిపారు. ముఖ్యంగా ఎక్స్‌ప్రెస్ రైళ్ల నిలుపుదలను పరిశీలించి చర్యలు తీసుకుంటామని తెలిపారన్నారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ

బొమ్మనహాల్ : మండలంలోని డి.హొన్నూరు గ్రామంలో పాఠశాలలో ఏర్పాటు చేసిన మధ్యాహ్న భోజనాన్ని ఎంఇఒ మల్లికార్జున శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రవి, ఉపాధ్యాయులు, మధ్యాహ్న భోజన పథకం కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వాలంటీర్ పోస్టులకు దరఖాస్తు చేసుకోండి

రాయదుర్గం : రాయదుర్గం పురపాలక సంఘం పరిధిలోని 1, 6, 9, 12, 16వ సచివాలయాల్లో 2, 10, 14, 20, 28 ఎన్నికల వార్డుల్లో ఖాళీగా ఉన్న ఐదు వాలంటీర్ పోస్టులకు అర్హులైన అభ్యర్థులు ఈనెల 17వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కమిషనర్ దివాకర్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 18 నుంచి 35 సంవత్సరాల మధ్య వయస్సు ఉన్న వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

బ్రహ్మసముద్రం తహశీల్దార్‌గా వాణిశ్రీ



బ్రహ్మసముద్రం : మండల నూతన తహశీల్దార్‌గా వాణిశ్రీ శుక్రవారం స్థానిక కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేస్తున్న బాలకిషన్ అనంతపురం బదిలీ అయ్యారు. అనంతపురం కలెక్టర్ కార్యాలయంలో కెఆర్‌సిసిగా బాధ్యతలు నిర్వహిస్తున్న వాణిశ్రీ ను ప్రస్తుతం బ్రహ్మసముద్రం మండల నూతన తాహసిల్దార్ గా డిప్యూటేషన్ పై బదిలీ చేసినట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎల్లవేళలా ప్రజలకు అందుబాటులో ఉండి రెవెన్యూ కార్యాలయంలో మండల మెజిస్ట్రేట్ గా అందరు మన్ననలను సూరగొంటానని ఆమె పేర్కొన్నారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది ఆమెకు ఘనంగా స్వాగతం పలికి కతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల రెవెన్యూ కార్యాలయ సిబ్బంది అధికారులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతపై అవగాహన ఉండాలి

అనంతపురం సిటీ : రోడ్డు భద్రతపై విద్యార్థులకు అవగాహన ఉండాలని మోటార్ వెహికల్ ఇన్స్‌పెక్టర్ ప్రసాద్ సూచించారు. రోడ్డు భద్రతా అవగాహన కార్యక్రమంలో భాగంగా శుక్రవారం నగరంలోని శ్రీచైతన్య పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మైనర్లు వాహనాలు నడపడం చట్టరిత్యా నేరమన్నారు. ఒకవేళ వాహనాలు నడిపితే తల్లిదండ్రులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే వాహనదారులుకూడా హెల్మెట్ ధరించాలని, నాలుగు చక్రాల వాహనదారులు సీట్ బెల్ట్ ధరించాలని, నియమిత వేగంతో వాహనాన్ని నడపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

కాలుష్య రహిత దీపావళి జరుపుకోవాలి

ఎస్‌వి విద్యాసంస్థల ఛైర్మన్ సోమశేఖర్‌రెడ్డి



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

ప్రజాశక్తి-అనంతపురం

కాలుష్య రహిత దీపావళి జరుపుకునేందుకు విద్యార్థులు కృషి చేయాలని ఎస్‌వి విద్యాసంస్థల ఛైర్మన్ సోమశేఖర్‌రెడ్డి పిలుపునిచ్చారు శుక్రవారం స్థానిక కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో స్వచ్ఛ దివాళి, శుభ దివాళిపై ఎస్‌వి డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మాట్లాడుతూ దీపావళి మనందరి జీవితంలో వెలుగులాంటిదన్నారు. కావున పర్యావరణానికి ముప్పు వాటిల్లకుండా పండుగ జరుపుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ఛైర్మన్ సి.చక్రధర్‌రెడ్డి, ప్రిన్సిపల్ వై.మధుసూదన్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపల్ టి.శ్రీనివాసులు, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ శ్రీనాథ్, అధ్యాపక, అధ్యాపకేతర బృందం, ఎన్ఎస్ఎస్ అధికారులు జి.ఆనంద్‌బాబు, ఎస్.పురుషోత్తం, విద్యార్థులు పాల్గొన్నారు

సక్రమంగా తాగునీరు సరఫరా చేయాలి

గుత్తి : వైటిసి ప్రాజెక్టు నుంచి తాగునీటిని సక్రమంగా సరఫరా చేయాలని వైసిపి ఐటీ వింగ్ జిల్లా అధ్యక్షుడు వై.రాజశేఖర్‌రెడ్డి కోరారు. ఈమేరకు శుక్రవారం ఆర్‌డబ్ల్యుఎస్ డిఇఇ రాజ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు జ్ఞానేశ్వర్‌రెడ్డి, కాశీరావు తదితరులు పాల్గొన్నారు.

ఆయుష్మాన్ భారత్ కార్డులు పంపిణీ

నార్పల : మండల పరిధిలోని బొందలవాడ గ్రామ పంచాయతీలో శుక్రవారం ఏర్పాటు చేసిన గ్రామసభలో ఆయుష్మాన్ భారత్ కార్డులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచి ఆలం వెంకట నరసానాయుడు, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులు, హౌసింగ్ వర్క్ ఇన్స్‌పెక్టర్ నాగభూషణ, ఎఎన్ఎం చంద్రకళ, ఎంపిటిసి సభ్యుడు శ్రీరాములు, వార్డు మెంబర్ బాబు, సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

టిడిపితోనే బడుగుల అభివృద్ధి

రాయదుర్గం రూరల్ : అన్నివర్గాల ప్రజలు అభివృద్ధి చెందాలంటే రాబోవు రోజుల్లో టిడిపిని గెలిపించాల్సిన అవసరం ఉందని మాజీమంత్రి కాలువ శ్రీనివాసులు కోరారు. శుక్రవారం మండల పరిధిలోని టి.వీరాపురం గ్రామంలో 'బాబు షూరిటీ' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపి అధికారంలోకి వస్తే పేద, సామాన్య ప్రజల సంక్షేమమే ధ్యేయంగా అనేక పథకాలను ప్రవేశపెట్టనున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ హనుమంతు, మాజీ సర్పంచి సుంకన్న, వీరేష్, సోమశేఖర్, ప్రసాద్, గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ డిఎం

రాయదుర్గం : ఈనెల 11వ తేదీ శనివారం సాయంత్రం రాయదుర్గం ఆర్టీసీ డిపోలో 'డయల్ యువర్ డిఎం' కార్యక్రమం నిర్వహించనున్నట్లు మేనేజర్ కె.సురేష్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రయాణికులు ఎవరైనా సెల్..99592 25863 నెంబర్‌కు ఫోన్ చేసి ఆర్టీసీ రవాణా సౌకర్యాలు, సూచనలు, సలహాలు ఇవ్వవచ్చని కోరారు.

కళ్యాణదుర్గం : కళ్యాణదుర్గం ఆర్టీసీ డిపోలో శనివారం డయిల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహించనున్నట్లు మేనేజర్ భద్రీనాథ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రయాణికులు ఎవరైనా సెల్..99592 25862 నంబర్‌కు ఫోన్ చేసి తమ సమస్యలతోపాటు సలహాలు, సూచనలు ఇవ్వవచ్చన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పుట్లూరు : మండలంలోని కోమటికుంట్ల సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల దృష్ట్యా శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఎఇ విజయుడు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కావున వినియోగదారులు గమణించి సహకరించాలని కోరారు.

ముందస్తు దీపావళి వేడుకలు


దీపాలను వెలిగిస్తున్న దృశ్యం

పెద్దపప్పూరు : మండలం పరిధిలోని చిన్నపప్పూరు సమీపంలో వెలసిన మౌర్య పాఠశాలలో దీపావళి వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పండుగ విశిష్టతను విద్యార్థులకు వివరించారు. చెడుపై మంచి గెలిచిన సందర్భంగా దీపావళి పండుగను జరుపుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ ఆంజనేయులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు గుత్తి క్రీడాకారుడు


ఎం.భువనేశ్వర్

గుత్తి : రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు గుత్తి క్రీడాకారుడు ఎం.భువనేశ్వర్ ఎంపికయ్యాడు. అనంతపురంలోని ఆర్‌డిటి స్టేడియంలో నిర్వహించిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్ జిఎఫ్) అండర్-17 క్రికెట్ ఎంపికలో గుత్తిలోని శ్రీసాయి జూనియర్ కళాశాలలో చదువుతున్న ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థి ఎం.భువనేశ్వర్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు కళాశాల నిర్వాహకులు తెలిపారు. త్వరలో గుంటూరులో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో భువనేశ్వర్ ఆడనున్నట్లు తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారున్ని పలువురు అభినందించారు.

వ్యవసాయ సలహా మండలి సమావేశం

గార్లదిన్నె : మండల కేంద్రంలోని వ్యవసాయాధికారి కార్యాలయంలో ఎడిఎ రవి ఆధ్వర్యంలో శుక్రవారం మండల స్థాయి వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎడిఎ మాట్లాడుతూ గార్లదిన్నె మండలాన్ని కరువు మండలంగా ప్రకటించిన నేపథ్యంలో దెబ్బతిన్న వేరుశనగ, కంది, ఆముదం, పత్తి రైతుల వివరాలను రైతు భరోసా కేంద్రాల సిబ్బంది ద్వారా గుర్తించి ప్రభుత్వానికి నివేదిస్తామని తెలిపారు. అదేవిధంగా జిల్లాలో ప్రత్యేకంగా 'జీవన రేఖ' అనే కార్యక్రమం చేపట్టారన్నారు. రైతు ఆత్మహత్యలను నివారించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి పి.సోమశేఖర్, ఎఇఒ స్రవంతి, ఆర్‌బికె సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

'ఉపాధి' పనులు పరిశీలన

పుట్లూరు : మండల పరిధిలోని గాండ్లపాడులో చేపట్టిన ఉపాధి హామీ పనులను ఎపిడి వెంకటరత్నం శుక్ర వారం పరిశీలించారు. ఇందులో భాగంగా మస్టర్‌ను తనఖీ చేశారు. అనంతరం కూలీలతో మాట్లాడుతూ ఫీల్డ్ అసిస్టెంట్ల కొలతల ప్రకారం పనులు చేస్తే రూ.250 నుంచి రూ.270 వరకూ కూలి పడుతుందన్నారు. అనంతరం తక్కలపల్లి గ్రామానికి చేరుకుని ఉపాధి కూలీలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఈసీ విజయ, నాగేందర్‌రెడ్డి, ఎఫ్ఎ పుల్లారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సర్వసభ్య సమావేశానికి ప్రజాప్రతినిధుల డుమ్మా..!

పుట్లూరు : మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిపి రాఘవరెడ్డి అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన సర్వసభ సమావేశానికి చాలామంది ప్రజాప్రతినిధులు డుమ్మా కొట్టారు. మండలంలో ఎంపిపితోపాటు 11 మంది ఎంపిటిసిలు, 23 మంది సర్పంచులు ఉన్నారు. అయితే శుక్రవారం సమావేశానికి ఎంపిపితోపాటు నలుగురు మాత్రమే హాజరుకావడం గమనార్హం. 12:30కు ముందు కోరం లేకపోగా తర్వాత ఒక ఎంపీటీసీ రావడంతో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎట్టకేలకూ అర్థగంటకే సమావేశం ముగించడం బాధాకరం. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ యోగానందరెడ్డి, డిటి మల్లేష్, ఇఒఆర్‌డి ఆనంద్‌ప్రసాద్, ఎంఇఒ శ్రీదేవి, హౌసింగ్ ఏఈ లోకేష్‌కుమార్, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

రైతులు, కూలీలను ఆదుకోవాలి

శింగనమల : తీవ్ర కరువు పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో ప్రభుత్వం రైతులతోపాటు కూలీలను ఆదుకోవాలని సిపిఐ మండల కార్యదర్శి రామాంజనేయులు డిమాండ్ చేశారు. ఈమేరకు శుక్రవారం మండలంలోని సలకంచెరువు సచివాలయ కార్యదర్శికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాలు కురవకపోవడంతో సాగు చేసిన పంటలు పూర్తిగా ఎండిపోయాయన్నారు. మరోవైపు కూలీలకు పనులు లేకుండా పోయాయన్నారు. కావున ప్రభుత్వం వెంటనే కరువు సహాయక చర్యలు చేపట్టడంతోపాటు ఉపాధి హామీ పథకం ద్వారా పనులు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్వర నాగప్ప, దైవత్వం, నరేష్, బాలిరెడ్డి, దొడ్డెన్న, చంద్రనారాయణ, లక్ష్మీదేవి, కుల్లయప్ప, ముత్యాలు, రామాంజనేయులు, ఆదినారాయణ, తదితరులు పాల్గొన్నారు

మునుస్వామి కుటుంబానికి అండగా ఉంటాం

శింగనమల : అకస్మాత్తుగా మృతిచెందిన మండల పరిధిలోని గురుగుంట్ల గ్రామానికి చెందిన బంగారు మునిస్వామి కుటుంబానికి అండగా ఉంటామని తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి దండు శ్రీనివాసులు భరోసా ఇచ్చారు. మునిస్వామి గురువారం సాయంత్రం ఇంటి వద్ద అకస్మాత్తుగా మృతిచెందాడు. విషయం తెలుసుకున్న దండు శ్రీనివాసులు టిడిపి నాయకుల ద్వారా దహన సంస్కారాలకు రూ.10వేలు ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అధిక ఫీజు వసూలు చేస్తున్న విద్యాసంస్థలపై చర్యకు డిమాండ్

రాయదుర్గం : పదో తరగతి విద్యార్థులతో అధిక ఫీజులు వసూలు చేస్తున్న విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని ఎఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఆంజనేయులు శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. నియోజకవర్గంలో పలు స్కూల్లో ప్రభుత్వం నిర్ణయించిన ఫీజు కంటే ఎక్కువ టెన్త్ ఫీజులు వసూలు చేస్తున్నారన్నారు. అలాంటి వాటిని ఉన్నతాధికారులు తెలుసుకుని చర్యలు తీసుకోవాలని కోరారు. లేనిపక్షంలో డిఇఓ కార్యాలయం ముందు ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.

టపాసుల దుకాణదారులు నిబంధనలు పాటించాలి

ఆత్మకూరు : దీపావళి పండుగ సందర్భంగా మండల వ్యాప్తంగా లైసెన్స్ పొందిన దుకాణదారులు తప్పనిసరిగా ప్రభుత్వ నిబంధనలు పాటించాలని ఎస్ఐ కె.జనార్ధన శుక్రవారం ఒక ప్రకటనలో సూచించారు. మండల వ్యాప్తంగా కేవలం లైసెన్స్ పొందిన దుకాణదారులు మాత్రమే బాణాసంచా విక్రయించాలన్నారు. విక్రయించే ప్రాంతంలో అగ్నిమాపక ఏర్పాటు చేసుకోవాలన్నారు.

ఎరువుల దుకాణాలపై దాడులు

అనంతపురం : అనంతపురం, బుక్కరాయసముద్రం మండలంలోని ఎరువుల దుకాణాలు, చౌక దుకాణాలపై అధికారులు శుక్రవారం దాడులు నిర్వహించారు. ఇందులో భాగంగా తక్కువ తూకం ఉన్న ఎరువుల బస్తాల కంపెనీలపై 2, అధిక ధరలపై 1, చౌక దుకాణంలో బియ్యం తక్కువ తూకం ఇస్తున్నందుకు 1కేసు నమోదు చేసినట్లు లీగల్ మెట్రాలజీ ఇన్స్‌పెక్టర్ గౌస్ తెలిపారు.

టయోటా వాహనం మేళా


షోరూమ్‌ను ప్రారంభిస్తున్న జెడ్పీ ఛైర్‌పర్సన్ గిరిజమ్మ

అనంతపురం : నగరంలోని ఆర్ట్స్ కళాశాల ఎదురుగా ఉన్న ఎగ్జిబిషన్ మైదానంలో ఏర్పాటు చేసిన హర్ష టయోట వారి వెహికల్ ఎక్చైజ్ మేళాను జెడ్పీ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో హర్ష టయోటా కంపెనీ వాహనదారులకు మంచి సేవలు అందిస్తోందన్నారు. భవిష్యత్తులో కూడా మరిన్ని సేవలు అందిచాలని ఆశాభావం వ్యక్తం చేశారు.

అటవీశాఖ అమరవీరుల దినోత్సవం

అనంతపురం : జిల్లాకేంద్రంలోని అటవీశాఖ కార్యాలయంలో శుక్రవారం అటవీశాఖ అమవీరుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐఎఫ్ఎస్ సందీఫ్ కృపాకర్ మాట్లాడుతూ 1991లో వీరప్పన్‌ను పట్టుకునేందుకు వెళ్లిన ఫారెస్టు ఆఫీసర్ పందిళ్లపల్లి శ్రీనివాస్‌ను నవంబర్ 10న హత్య చేయడంతో అప్పటి నుంచి అటవీశాఖ అమరవీరు దినోత్సవాన్ని జరుపుకుంటున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో అటవీ క్షేత్రాధికారులు, వనపాలకులు, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు, అసిస్టెంట్ ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు, సర్కిల్ ఆఫీస్, డివిజన్, రేంజ్ ఆఫీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

యువకుడికి జీవిత ఖైదు

గుత్తి : బాలికపై అత్యాచారయత్నానికి పాల్పడిన రాముల చరణ్‌రాజుకు జీవిత ఖైదు విధిస్తూ అనంతపురం పోక్సో కోర్టు శుక్రవారం తీర్పునిచ్చింది. సీఐ ఎం.వెంకటరామిరెడ్డి తెలిపిన వివరాల మేరకు.. 2021 అక్టోబర్ 12న గుత్తి మండలంలోని జక్కలచెరువు గ్రామానికి చెందిన ఆరేళ్ల బాలిక ఆరుబయట ఆడుకుంటుండగా అదే గ్రామానికి చెందిన రాముల చరణ్‌రాజు చాక్లెట్ ఇస్తానని మాయమాటలు చెప్పి బాలికను ఇంటి వెనక ఉన్న పత్తి చేనులోకి తీసుకెళ్లాడు. అక్కడ బాలికను అత్యాచారం చేస్తుండగా కేకలు పెట్టింది. అటు వైపున వెళ్తున్న గ్రామస్తులు పరిగెత్తి వెళ్లడంతో రాముల చరణ్‌రాజు పారిపోయాడు. ప్రత్యక్ష సాక్షులు ఆ పాపను తీసుకొచ్చి తల్లిదండ్రులకు అప్పగించి జరిగిన విషయం తెలిపారు. దీంతో తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు గుత్తి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. అప్పటి తాడిపత్రి డీఎస్పీ కృష్ణ చైతన్య కేసు దర్యాప్తు చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. అనంతపురం పోక్సో కోర్టు జడ్జి రాజలక్ష్మి 11 మంది సాక్షులను విచారించి ముద్దాయి అయిన రాముల చరణ్‌రాజుకు జీవిత ఖైదుతో పాటు రూ.5వేలు జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు. అలాగే బాధితురాలికి రూ. 5 లక్షలు పరిహారం చెల్లించేలా తీర్పు ఇచ్చారు.

టమోటా బాక్సులకు నిప్పు

కళ్యాణదుర్గం : మండల పరిధిలోని కొండాపురం గ్రామంలో టమోటా బాక్సులు కాల్చివేసిన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు...కొండాపురం గ్రామానికి చెందిన రైతు శ్రీనివాసులు తన వ్యవసాయ పొలంలో టమోటా సాగు చేశారు. ఈనేపథ్యంలో టమోటా పంటను పీకేందుకు గురువారం రాత్రి 200 బాక్సులను తోటలో సిద్ధంగా ఉంచాడు. అయితే శుక్రవారం ఉదయం వెళ్లి చూడగా గుర్తు తెలియని వ్యక్తులు బాక్సులను కాల్చివేశారన్నారు. ఈప్రమాదంలో టమోటా బాక్సులతో పాటు మోటారు వైరు, పైపులు కూడా కాలిపోయాయన్నారు. దీంతో సుమారు రూ.లక్ష వరకూ నష్టం సంభవించినట్లు తెలిపారు. ఈమేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.